# వారధి

## స్వగతంబు

"రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ! ఎంత సేపూ వీళ్లే! మొహం మొత్తి మోహం మొత్తబడిపోయింది. అలా భూలోకానికి వెళ్ళొస్తే సరి. సరికొత్త అందాలు చవి చూసి రావచ్చు." అనుకుని ఇంద్రుడు ఒంటరిగా, తుంటరిగా ఇనక పట్నం విచ్చేశారు.

సూపర్ బజార్ జంక్షన్‌లో రంగు రంగుల దీపాల వెలుగులో ఆడవాళ్ళ కేసి ఆత్రంగా చూసి గుటకలు మింగుతున్న ఇంద్రుడ్ని రిక్షా అప్పారావు చూశాడు.

"తమది ఈ వూరు కాదనుకుంటాను బాబూ! ఇలా వూరంతా తిరిగితే తెల్లారిపోతుంది. కుమారస్వామి భూమి చుట్టూ ప్రదక్షిణం చేసినట్టు అలా వీధులన్నీ వెదుక్కుంటూ తిరిగే బదులు నా రిక్షాలో ఎక్కండి. వినాయకుడు శివుడి చుట్టూ ప్రదక్షిణం చేసినట్టు రాత్రిలోగా ఈవూరు అందాన్ని, వూర్లో అందాల్ని తమకి చూపిస్తాను. రండి బాబూ!" అని ఆహ్వానించాడు రిక్షా అప్పారావు.

ఇంద్రుడుగారు కొంచెం తటపటాయించారు.

"పోలీసు రెయిడ్ అవుతుందని భయపడకండి బాబూ! ఆళ్ళంతా ఆటో రిక్షావాళ్ళ సమ్మెలో బిజీగా వున్నారు. మన దగ్గర కెవ్వరూ రారు. రండి బాబూ," అని అప్పారావు భరోసా ఇచ్చాడు.

"సరే"నని రిక్షా ఎక్కి అందాల వేటకి బయల్దేరారు ఇంద్రుడుగారు.

"మా వూళ్ళో యమ్మెల్లేగారి తర్వాత పలుకుబడిలో చెప్పాలంటే పెద్దమ్మగారి పేరే చెప్పాలి. ఆరి ఇంట్లో ఎప్పుడూ అర డజను మంది అర కోడిలాంటి అందమైన అమ్మాయిలు వుంటారండి. సోడాలు, జీడి పప్పు, ఐసుబాక్స్, ఫోను అన్నీ రెడీ. ముందు అక్కడి కెళ్ళమంటారా?" అనడిగాడు అప్పారావు.

"అలాగే" అన్నారు ఇంద్రుడుగారు.

అర్ధరాత్రి అయ్యింది. పెద్దమ్మగారింట్లో పని చూసుకుని వచ్చిన ఇంద్రుడుగారు మళ్ళీ అప్పారావు రిక్షా ఎక్కారు.



"అప్పుడే వచ్చేశారేం బాబూ! ఆపగు రున్నారు కదా! అయినా తమలాంటి పెద్దోళ్ళు అన్నం అంతా పట్టుకు చూడాలేటి? ఒక్క మెతుకు ముట్టుకుంటే చాలు" అన్నాడు అప్పారావు.

ఇంద్రుడుగారు విలాసంగా మీసం తిప్పారు.

"ఇప్పుడు మనం సత్తెవతి ఇంటికెళ్దా రండి. మంచి ఫేమిలీ కేసు. హస్బెండుగారు చాలా మంచాడండి. అక్కడ రిక్షా ఆపగానే తమరు - బావగారూ బావగారూ - అని రెండుసార్లు పిలవాలి. లోపల పేసింజర్లు లేకపోతే తలుపు తీస్తారు. కావాలంటే తమరి బోర్డింగ్, లాడ్జింగ్ అక్కడే ఏర్పాటు చేస్తారు. ఫేమిలీ అండి" అంటూ రిక్షా సత్యవతి ఇంటి ముందు ఆపాడు అప్పారావు.

రెండయింది. అలిసి వచ్చిన ఇంద్రుడుగార్ని రిక్షాలో ఎక్కించుకుని అంతర్జాతీయ రహదారికి వచ్చాడు అప్పారావు.

"ఇక్కడ పొందు కంటే మందు ఎక్కువ. వర్సు, వుంగరాలు, ఇతర సామాను జాగ్రత్త! ఓడల్లో వచ్చిన దొరల బేరం వుంటే అమ్మాయిలు మీ ముఖం కూడా చూడరు. ఇక్కడ ఒక సదుపాయం వుంది బాబూ ఇరవై నాలుగు గంటలు డాక్టరుంటాడు. ఇంజక్షన్లూ, గొట్టం మాత్రలు ఇస్తాడు" అని హెచ్చరించిలోనికి పంపించాడు.

సూర్యోదయం అయ్యేముందు ఇంద్రుడుగారు ఇవతలికి వచ్చారు.

"చాలా అలసిపోయారు బాబూ! తమరు ఆనందించాలి. మేం బతకాలి బాబూ!" అన్నాడు అప్పారావు ఇంద్రుడుగార్ని అభినందిస్తూ.

"అందానికి, ఆనందానికి విలువ కట్టడం ఎవరితరం అప్పారావూ! ప్రస్తుతానికి ఇది తీసుకో" అంటూ మెడలోంచి ముత్యాల హారం తీసిచ్చారు ఇంద్రుడుగారు.

"ఇక్కడ ప్రతీదానికి సర్కారు వారి రేటు వుంది బాబూ! తమరు ఖర్చు పెట్టిన ప్రతీ రూపాయిలోనూ ఒక పావలా నాకు వస్తుంది బాబూ. ఒక పావలా కంపెనీ వాళ్ళకి పోతుంది. కళ్ళు మూసుకున్న అధికారులకొక పావలా! మిగిలిన పావలా మీకు ఆనందాన్నిచ్చిన ఆ అందానికి మిగులుతుంది. ఈ అందం, ఆనందం అంతా రాత్రే. తెల్లారితే ఎవరి దారి వారిది" అంటూ ముత్యాలహారం తీసుకున్నాడు అప్పారావు.

"అప్పారావు! నువ్వు కేవలం మార్గదర్శివే కాదు. గొప్ప వేదాంతివి. నాకు నచ్చావు. ఏదైనా వరం కోరుకో ఇస్తాను" అన్నారు ఇంద్రుడుగారు.

అప్పారావు నవ్వాడు.

"నేను ఇంద్రుడ్ని. నమ్మకపోయినా వరం కోరుకో. అది తీరాక నువ్వే నమ్ముతావు" అన్నారు ఇంద్రుడుగారు.

"ఇతరుల కష్టంమీద బతకటం నాకు మనసు కష్టంగావుంది బాబూ! కనీసం వచ్చే జన్మలో గౌరవంగా నా కష్టంమీద బతికే వరం ప్రసాదించు దేవా!" అని చేతులు జోడించి అర్థించాడు అప్పారావు.

"మనం సుఖంగా వుండాలంటే ఇతరుల కష్టంమీదే బతకాలి. మనసుని పక్కకిపెట్టి మనిషిగా బతుకు. వచ్చే జన్మలో నువ్వు ఆడవాళ్ళ కష్టం మీద బతికినా సంఘంలో గౌరవం వస్తుంది. రచయిత్రుల రచనల్ని అచ్చువేసే పబ్లిషర్‌వై పాఠకులకి పుస్తకాలు అందిస్తావు. ఓడల్లో దొరల బేరాల్లాంటి లైబ్రరీ బేరాలు కూడా నీకు లభించి లాభించుగాక!" అని వరం ఇచ్చి ఇంద్రుడుగారు మాయమైపోయారు.

నీతి - పబ్లిషర్లు రచయితలకు, పాఠకులకు మధ్య వారధిలా వుండాలి. సొంత లాభము కొంత మానుకుని లక్ష్మీపూజతో పాటు సరస్వతీ పూజకూడా చెయ్యాలి.

— తంబు

